క్లుప్తంగా

ఆర్మీ ర్యాలీకి విరాళం



ఆర్మీ ర్యాలీకి విరాళం అందజేస్తున్న అరబిందో ఫార్మా ప్రతినిధులు

బోట్‌క్లబ్‌: కాకినాడ క్రీడా మైదానంలో ఆగస్టు నెలలో జరగనున్న జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్ షిప్, ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.15 లక్షల సీఎస్ఆర్ నిధులు, కాకినాడ ఆదిత్య విద్యాసంస్థలు రూ.4 లక్షలు అందజేశాయి. కలెక్టరేట్‌లో శుక్రవారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ జీఎం అడ్మిన్ ఎ.శ్రీనివాస్, సీఎస్ఆర్ జీఎం డి.సుధాకర్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు సుగుణారెడ్డి, శృతిరెడ్డి కలెక్టర్ షణ్మోహన్‌కు చెక్కులను అందజేశారు.

రామన్నకు విప్లవ జోహార్లు

బోట్‌క్లబ్‌: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కమిటీ సభ్యుడు విప్పర్తి రామన్న ఐదో వర్ధంతి సభ కాకినాడ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు ముందుగా రామన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన రామన్న యుక్తవయసులోని విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై, తుది శ్వాస విడిచే వరకు పేద ప్రజల పక్షాన నిలబడి విప్లవ పోరాటాలు సాగించాడని కొనియాడారు. జిల్లా ఐఎఫ్‌టీయూ నాయకులు గుబ్బల ఆదినారాయణ మూర్తి, బంగారు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఆయనకు జోహార్లు అర్పించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్‌: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఇద్దరికి ఐదురోజులు చొప్పున జైలు, 10 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో 10 మందిని హాజరుపర్చగా వారికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది ఎంపిక

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది ఎంపికైనట్టు పీఆర్‌ఓ ఆర్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఎండేవా కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించగా సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ విభాగాల నుంచి 130మంది పాల్గొన్నారన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ కరుణ అరవ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారని తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాకినాడ రూరల్‌: నియోజకవర్గ పరిధిలో ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పంథకం కింద వైద్య అవసరాలకు మంజూరైన రూ.3.66 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం పంపిణీ చేశారు. గుడారిగుంటలో తన నివాసం వద్ద లబ్ధిదారులు గోనెల లోవరాజు, పెద్దింశెట్టి వీరబ్రహ్మం, దాసరి లక్ష్మిలకు చెక్కులు పంపిణీ చేశారు.

303 మందికి హెచ్‌ఐవీ వ్యాక్సిన్లు



పెద్దాపురం ఆసుపత్రిలో ఎయిడ్స్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

పెద్దాపురం: స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో చికిత్స పొందుతున్న 303 మంది హెచ్‌ఐవీ రోగులకు వ్యాక్సిన్ వేసినట్టు పెద్దాపురం ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఐసీటీసీలో ఆయా రోగుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్లు ఉమామహేశ్వరి, ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హెచ్‌ఐవీ బాధితులకు మందులు పంపిణీ చేశామన్నారు. ఇక నుంచి బాధితులకు ప్రమాదం లేకుండా వ్యాక్సిన్ వేయించడం జరుగుతుందన్నారు. ఎవరైనా హెచ్‌ఐవీ బాధితులు మిగిలిపోయి ఉంటే ఆసుపత్రిలోని ఐసీటీసీ విభాగంలో బాధితులకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నమణి, సీపీఎం బాలాజీ, డీసీ బుజ్జిబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, చంద్రమౌళి, జ్యోతి, ఎల్‌టీ శ్రీనుబాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సేద్యానికి సై..

- కలసిరాని కాలంలో మురిపించిన వానలు
- జోరందుకున్న వరినాట్లు
- వెదజల్లుకే ప్రాధాన్యం
- చురుగ్గా బెంగాలీ ఊడ్పులు



కరపలో వరినాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు



వాకాడలో సార్వానాట్లకు ట్రాక్టర్‌తో దమ్ము పనులు



పాతర్లగడ్డలో వెదజల్లిన పొలం

కరప: మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. సార్వా సీజన్ త్వరగా ప్రారంభించి జూలై నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినా నైరుతి రుతుపవనాలు మొండికేయడం, కాలువలకు నీరు ఆలస్యంగా వదలడం వంటి కారణాలతో రైతులు నారుమళ్లు వేయడంలో ఆలస్యం చేశారు. దీంతో ఖరీఫ్ సీజన్ ఆలస్యమైంది. జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు నీరు విడుదల చేసినా, కాలువ పనుల నెపంతో 20 రోజులు ఆలస్యం చేశారు. ఈ కారణంగా కొంత మంది నారుమళ్లు వేసుకోగా, మరికొందరు వెదజల్లు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నాలుగు రోజులుగా ఆకాశం మబ్బులు పట్టి అడపాదడపా వర్షాలు పడుతుండటంతో వరినాట్లు ప్రారంభించారు. మండలంలో 14 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఈ ఏడాది సార్వా ఆలస్యం కావడంతో 30 శాతం ఎకరాల్లో వెదజల్లుకు మొగ్గు చూపుతున్నారు. గత నాలుగు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. ముందుగా వేసిన నారుమళ్లు ఏపుగా పెరిగాయని రైతులు చెప్తున్నారు. వరినారు పెరుగుదలతో రైతులు పంట పొలాలకు నీరు మళ్లించి దమ్ములు చేయించి, వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కరప, అరట్లకట్ట, నడకుదురు, పెద్దాపురప్పాడు, కూరాడ, వేళంగి, పెనుగుదురు, వలసపాకల, జి.భావారం, పేపకాయలపాలెం, పాతర్లగడ్డ, గొర్రిపూడి, విజయరాయుడుపాలెం, యండమూరు, వాకాడ తదితర గ్రామాల్లో నాట్లు ప్రారంభమయ్యాయి. కూలీ రేట్లు కూడా గత ఏడాది కంటే పెరిగాయని రైతులు అంటున్నారు. మగవారికి రూ.700 మధ్యాహ్నం వరకు, రోజంతా చేసేందుకు రూ.1200 తీసుకుంటున్నారు. మహిళా కూలీలకు రూ. 400 నుంచి రూ.600 వంతున తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. సార్వా సాగు ఆలస్యం కావడంతో అధిక శాతం బెంగాల్ ఊడ్పులు ఎక్కువగా జరుగుతున్నాయి. బెంగాల్ కూలీలే నారుతీసి, నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.4 వేలు తీసుకుంటున్నారు. ఈ పద్ధతి వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నట్టు రైతులు తెలిపారు. అదే సంప్రదాయ పద్ధతిలో నారుతీసి, నాట్లు వేసేందుకు రూ.12 వేలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు. వర్షాలు కురవకపోయినా మబ్బులు పట్టి చల్లచల్లగా ఉంటే సార్వా పనులు సజావుగా సాగుతాయని రైతులు అంటున్నారు. వాతావరం చల్లగా ఉంటే ఊడ్చిన చేలు త్వరగా మూనదేరి, దుబ్బు చేస్తాయని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు పడుతుండటం వల్ల వెదజల్లు సాగుకు ప్రతికూలంగా ఉందని కొంత మంది రైతులు తెలిపారు. రెండు వారాలు పాటు వర్షాలు పడకుండా వాతావరణం అనుకూలిస్తే తొలకరి నాట్లు ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా సాగుతాయని రైతులు అంటున్నారు.

60 శాతం నాట్లు పూర్తి

మండల పరిధిలో ఇంత వరకు 60 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. శివారు, మెరక ప్రాంతాలలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సార్వా సీజన్‌లో 60 శాతం మేర ఎంటీయూ –7029 (స్వర్ణ), 35 శాతం ఎంటీయూ – 1318, మిగిలిన విస్తీర్ణంలో ఇతర రకాలు సాగుచేస్తున్నారు. ఇంత వరకు 8,400 ఎకరాల్లో వరినాట్లు వేయగా 2,500 ఎకరాల్లో వెదజల్లు సాగుచేశారు. ఈ ఏడాది రైతులు ఎక్కువగా బెంగాల్ ఊడ్పులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో 4 వేల ఎకరాల్లో దమ్ములు పూర్తయ్యాయి. నారుమళ్లు వేసుకోని రైతులు వెదజల్లు సాగును అనుసరిస్తే సమయం, పెట్టుబడులు ఆదా అవుతాయి. తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. విత్తనాలు నానపెట్టి మొలకవచ్చిన తర్వాత మళ్లల్లో బురదపదునుపై చల్లాలి. వెదజల్లులో కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

నాట్లపై అవగాహన కల్పిస్తున్నాం



ఏఈఓలు, ఎంపీఈఓలతో కలసి గ్రామాల్లో పర్యటించి వరి నాట్లు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. వరినాట్లు వేసే ముందు నారును సుతలు తుంచి నాటుకోవాలి. దీనివల్ల ఆకుముడత, కాండం తొలుచు పురుగు గుడ్లను నారుమడి దశలోనే అదుపు చేసుకోవచ్చు. సిఫార్సు చేసిన ఎరువులు మోతాదులో భాస్వరం ఎరువును పూర్తిగాను, సగం పొటాష్ ఆఖరి దమ్ములో వేయాలి. నత్రజని మూడు భాగాలుగా విభజించి వేసుకోవాలి.

ఇమ్మిడిశెట్టి సత్య, కరప మండల వ్యవసాయాధికారి

బెంగాల్ ఊడ్పులు చేయిస్తున్నాం



ఈ ఏడాది సార్వా సీజన్‌లో బెంగాల్ ఊడ్పులకే ప్రాధాన్యం ఇస్తున్నాం. బెంగాల్ కూలీలే నారుతీసి, వరి నాట్లు వేస్తున్నారు. ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.4,200 తీసుకుంటున్నారు. ఈ పద్ధతిలో విత్తనాలు కూడా తక్కువ అవసరమవుతాయి. 15 నుంచి 18 రోజులు వయసున్న వరినారుతో ఊడ్పులు వేయడం వల్ల కాలవ్యవధి కలిసి వస్తోంది. ఈ పద్ధతిలో బాగా దుబ్బుచేసి, దిగుబడులుకూడా బాగుంటున్నాయి.

పెంకే అప్పన్న, కౌలురైతు, కరప

విద్యార్థులకు సీపీఆర్‌లో శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ రామకృష్ణ

బోట్‌క్లబ్‌: పాఠశాలల్లో 9, పదో తరగతి విద్యార్థులకు రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. క్లబ్ సమావేశం శుక్రవారం అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల గుండెపోటు మరణాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రోటరీ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి డ్రీమ్ ప్రాజెక్టుగా సీపీఆర్‌లో రోటరీ సభ్యులతో పాటు పాఠశాల స్థాయి విద్యార్థులకు కూడా శిక్షణ ఇవ్వడం ద్వారా తక్షణం వైద్యం చేయడం వల్ల ప్రాణాలు రక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న 18 రెవెన్యూ జిల్లాల పరిధిలోని అన్ని రోటరీ క్లబ్‌లు సీపీఆర్ శిక్షణ నిర్వహించేందుకు ప్రాజెక్టు రూపొందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ్ చక్రవర్తి, రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు పాల్గొన్నారు.

పలు కోర్సులకు కౌన్సెలింగ్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే, బీటీహెచ్ స్వీడన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ కోర్సు ప్రవేశాలకు మొదటి దశ కౌన్సెలింగ్ శుక్రవారం సెనేట్ హాల్లో నిర్వహించారు. బీటెక్ సీఎస్ఈ, ఎఐఎంఎల్, ఈసీఈ, ఈఈఈ కోర్సుల ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించగా 70 మంది హాజరయ్యారు. వీరిలో సీఎస్ఈ 40 సీట్లకు 28 మందికి ప్రవేశాలు కల్పించగా మిగతా సీట్లు రెండో దశ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామని అడ్మిషన్స్ డైరెక్టర్ రాము తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో స్వీడన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గురుదత్, రెక్టార్ సుబ్బారావు, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

కరప: మండలంలో శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధరరావు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజాదికాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో మహిళలు అమ్మవారిని దర్శించుకుని, కుంకుమ పూజచేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు తరలివచ్చిన 300 మంది మహిళలు

స్థానిక విష్ణాలయంలో శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గోపాలకృష్ణ, అనంతాచార్యులు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి, అదేప్రాంగణంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామం నుంచి తరలివచ్చిన 300 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, సీహెచ్ శ్రీను పర్యవేక్షణలో నిర్వహించిన వ్రతాలలో భక్తులకు అమ్మవారి ఫొటో, రాగిరూపు, గాజులు, పసుపు, కుంకుమ, కంకణాలు అందజేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, పిఠాపురం, కాకినాడ, పుట్టకుండ, వేళంగి ఈఓలు ఆర్.సౌజన్య, కె.సుబ్రహ్మణ్యం, వడ్డాది సత్తిబాబు, మోర్త మురళీ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

బోట్‌క్లబ్‌: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని ఆలయాలు మహిళలతో సందడిగా కనిపించాయి. టూటౌన్ వద్ద గల రామాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో వీర్రాజు ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో వ్రతాలు నిర్వహించగా, దాతలు, భక్తుల సహకారంతో వ్రతాలు ఆచరించే భక్తులకు ఉచితంగా పూజా సామాగ్రి అందజేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో, శాస్త్రోక్తంగా జరిగిన వ్రతాల్లో సుమారు 300 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



కరప విష్ణాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు



భక్తులకు దేవదాయశాఖ తరఫున రాగి రూపులు అందజేస్తున్న పిఠాపురం ఈఓ సౌజన్య

విధి నిర్వహణలో అలక్ష్యం వద్దు



జీవనిని సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ బిందుమాధవ్ పోలీస్ అధికారులకు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాను నేర రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. బాలలు, మహిళలపై నేరాలను నియంత్రించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసి రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని సూచించారు. గంజాయి నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, మరిన్ని మంచి ఫలితాలు రావాల్సి ఉందని, డ్రోన్లు, సీసీ కెమేరాలు, సాంకేతికత సాయంతో కేసు విచారణ నిర్వహించగలిగే సామర్థ్యాన్ని సిబ్బంది పెంపొందించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన ప్రణాళిక ఆచరణతో పాటు ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో జిల్లాలో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పి అన్నారు. అనంతరం వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది, అధికారులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ట్రైనీ డీఎస్పీకి సన్మానం

ట్రైనీ డీఎస్పీగా కాకినాడ జిల్లా పోలీస్ శాఖ పరిధిలో శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారి జీవనిని ఎస్పీ బిందుమాధవ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులంతా హాజరయ్యారు.

పన్ను బకాయి చెల్లిస్తేనే ఆస్తి రిజిస్ట్రేషన్

- ఆగస్టు 1 నుంచి ప్రారంభం



ఆటో మ్యుటేషన్‌పై అవగాహన కల్పిస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1 రామారావు

కాకినాడ లీగల్‌: ఇళ్లు, ఫ్లాట్‌కు ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తేనే ఆగస్టు 1వ తేదీ నుంచి ఆస్తి రిజిస్ట్రేషన్ జరుగుతాయి. ప్రభుత్వం తీసుకున్న ఆస్తి పన్ను ఆటో మ్యుటేషన్ నూతన విధానంలో ముందుగా కార్పొరేషన్, మున్సిపాల్టీలలో జరగనున్నాయి. ఇందులో భాగంగా కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద క్రయ విక్రయదారులు, దస్తావేజు లేఖర్లతో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1ఆర్.వి రామారావు సమావేశం నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ రామారావు మాట్లాడుతూ నూతన విధానంతో ఆస్తి పన్ను ఆటో మ్యుటేషన్ ద్వారా మారుతుందని, అలాగే రిజిస్ట్రేషన్ వచ్చే సమయానికి ఆస్తి పన్ను చెల్లించి రావాలని, ఎటువంటి బకాయి ఉండకూడదు అన్నారు.

తుపాను హెచ్చరికలతో బోట్లకు లంగరు



కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద లంగరు వేసిన ఫిషింగ్ బోట్లు

కాకినాడ రూరల్‌: తుపాను హెచ్చరికలతో సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారుల బోట్లు తీరానికి చేరుకున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా వానలు పడుతున్నాయి. తీర ప్రాంత వెంబడి బలమైన ఈదురు గాలులు వీయడంతో సముద్రం అల్లోకల్లోలంగా మారింది. సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో శుక్రవారం సాయంత్రానికి చాలా వరకు బోట్లు ఒడ్డుకు చేరుకున్నాయి.

నేడు సముద్ర నాచు పెంపకంపై శిక్షణ

కొత్తపల్లి: స్థానిక సురక్ష ప్యాలస్‌లో శనివారం కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన స్వయం శక్తి సంఘ సభ్యులకు సముద్ర నాచు పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్టు మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభవుతుందన్నారు. కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని స్వయం శక్తి సంఘ సభ్యులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ రాజేశ్వరి

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు మేనేజర్ ఎం.రాజేశ్వరి అన్నారు. వీకే రాయపురం పంచాయతీ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జన సురక్ష పథకంలో ఏడాదికి రూ.20 బీమా ప్రీమియంగా చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. ఈ బీమా పాలసీ కలిగిన వారు ప్రమాదవశాత్తూ మరణించినా, పూర్తిగా అంగవైకల్యం చెందితే రూ.రెండు లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష బీమా వస్తుందన్నారు. దీనికి 18 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నవారికి సులభంగా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. అయితే ఈ పథకాన్ని అంగీకరిస్తూ సంతకం చేస్తే ప్రతి ఏటా బ్యాంకులో నిల్వ నుంచి బీమా ప్రీమియం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు ఖాతాలో తగిన నిల్వ ఉండాలని సూచించారు. అదే విధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన 18 నుంచి 50 ఏళ్ల కలిగిన వారు ప్రీమియంగా ఏడాదికి రూ.436 చెల్లించాలన్నారు. పాలసీదారుడు మరణిస్తే నామినీకి బీమా మొత్తం లభిస్తుందని చెప్పారు. బ్యాంకుకు అంగీకార పత్రం ద్వారా ఏటా బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం డెబిట్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, రైతు సంఘ నాయకుడు గొల్లపల్లి నానాజీ, రైతులు పాల్గొన్నారు.

తీరంలో అలజడి

- కోతకు గురవుతున్న గృహాలు
- భయాందోళన చెందుతున్న మత్స్యకారులు



ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో తీర ప్రాంతంలో అలల ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. కెరటాల ఉధృతికి మత్స్యకారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులగా సముద్రపు అలలు ఎగసి పడడంతో మత్స్యకారుల గృహాలు కోతకు గురవుతున్నాయి. అలలు తాకిడితో గంగపుత్రుల ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. తీరప్రాంత రక్షణగా వేసిన జియోట్యూబ్ పూర్తిగా ధ్వంసం కావడంతో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. ఇళ్లతో పాటు విద్యుత్ స్తంభాలు, రోడ్లు, వృక్షాలు సైతం సముద్ర గర్భంలో కలిసి పోతున్నాయి. ఉప్పాడ– కాకినాడ బీచ్‌రోడ్డులో సముద్రపు అలలు తీరాన్ని తాకుతుండడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.



తీరప్రాంతంలో కూలిపోయిన మత్స్యకారుల ఇళ్లు



కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న మత్స్యకార గృహాలు